క్లుప్తంగా

కొండాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మేడిపల్లి: కొండాపూర్ గ్రామంలో ఆదివారం శ్వేత హాస్పిటల్ డాక్టర్ వై.రాహుల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వందకు పైగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ


ఆవిష్కరించిన నాయకులు

రాయికల్: పట్టణంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు గంప ఆనందం, ప్రధాన కార్యదర్శి పిప్పరి గంగాధర్, కోశాధికారి చింత అశోక్, పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, పట్టణ నాయకులు గరిపెల్లి శ్రీనివాస్, పవన్, చింత శివకుమార్, లింగ శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లకు తరలిన బీజేపీ శ్రేణులు


సిరిసిల్లకు తరలివెళ్తున్న నాయకులు

కథలాపూర్: బీజేపీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి కథలాపూర్ మండలంలోని బీజేపీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో సఫలీకృతమయ్యామని నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

బీసీలకు నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న రమేశ్

కథలాపూర్: ప్రభుత్వం ఈనెల 19న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున బీసీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇప్పపెల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జలందర్, సతీశ్‌గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి


మొగిలిపేటలో రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న నాగరాజు

మల్లాపూర్: రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ సర్పంచ్ నాగరాజు అన్నారు. ఆదివారం మొగిలిపేట గ్రామంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి నిరసన తెలిపారు. రుణమాఫీ కాని రైతులందరూ రాజకీయ పార్టీలకతీతంగా ఉద్యమించేందుకు ముందుకు రావాలన్నారు. ప్యాక్స్ వైస్ చైర్మన్ దూలూరి సుధాకర్‌రెడ్డి, నాయకులు దండవేని వెంకట్‌రెడ్డి, రైతులు కొమిరి బాజయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, మద్దెల శ్రీనివాస్, రెండ్ల సాయన్న, గాండ్ల బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎస్‌కేఎస్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. రెండు సంవత్సరాల పదవీకాలం కోసం అధ్యక్షుడిగా గుండ సురేశ్, ఉపాధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాయి శ్రీధర్‌రావు, సహాయ కార్యదర్శులుగా రాజేందర్, రాజు, శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా కొడిపెల్లి పురుషోత్తం రెడ్డి, కుసుంబ శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా వేముల శ్రావణ్, గౌరవ అధ్యక్షులుగా నర్సయ్య, రాజన్న, రామేశ్వర్‌రావు, తిరుమల్ రావు, శంకరయ్య, పరందాములు, వెంకటరమణ, పృథ్వీధర్‌రావు ఎన్నికయ్యారు.

ఘనంగా వార్షిక వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

గొల్లపల్లి: చిల్వాకోడూరులోని శ్రీగాంగేయ పాఠశాల వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ మల్లేశం, విశ్రాంత జేసీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు చలువ పందిళ్లు

- నర్సరీల్లో ప్రత్యేక చర్యలు


బతికపల్లిలో మొక్కలు పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరన్(ఫైల్)

పెగడపల్లి: ఎండలు మండుతున్నాయి. వన మహోత్సవంలో భాగంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే నర్సరీల్లో మొక్కల సంరక్షణకు గానూ చలువ పందిళ్లు(షెడ్ నెట్లు) వేశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ఉపాధిహామీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

చలువ పందిళ్లు ఇలా..

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు 10వేల మొక్కల చొప్పున లక్ష్యం నిర్ణయించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వన నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. ఇందకుగాను మండలవ్యాప్తంగా 2.30లక్షల మొక్కలను పెంచుతున్నారు. అయితే పెంచుతున్న మొక్కలు వేసవిలో ఎండిపోకుండా నర్సరీల చుట్టూ ప్రత్యేకంగా స్తంభాలను ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేశారు. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో.. ఉదయం 9 గంటల్లోపే సిబ్బంది మొక్కలకు నీళ్లు పడుతున్నారు.

కూలీలకు ఉపాధి

ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో సుమారు 400 నుంచి 500 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. కూలీలు మొక్కలను పెంచడం, నీళ్లు పోయడం లాంటి పనులు చేస్తున్నారు. మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపాధి కూలీలు ఎండలో కూడా పని చేస్తున్నారు.

కార్యదర్శులకు బాధ్యతలు

నర్సరీల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. ప్రతి వన నర్సరీలో నీటి సదుపాయం ఏర్పాటు చేసేందుకు బోరు బావి వేశారు. పెంచుతున్న మొక్కలను ఉపాధిహామీ కూలీలతో రోజు నీటిని పట్టించి మొక్కలు ఎండిపోకుండా చూడాల్సి ఉంది. నర్సరీల నిర్వహణపై నిత్యం జిల్లాస్థాయి అధికారులతోపాటు ఎంపీడీవో, ఎంపీవోలు, ఈజీఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు కురిస్తే జూన్ రెండో వారం వరకు వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. నర్సరీల నిర్వహణకు ఎలాంటి లోపాలు లేకుండా చూస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వేసవిలో ఎండ వేడిమికి మొక్కలు చనిపోకుండా పెంచిన ప్రతి మొక్కను కాపాడాలనే ఉద్దేశంతో చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. మొక్కలను వృక్షాలుగా పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందులో భాగంగానే మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, పెగడపల్లి

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం


చెక్కు అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మందికి రూ.10.77లక్షల విలువైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, జవ్వాజి చొదరి, రాజారెడ్డి, గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీఅష్టలక్ష్మి సహిత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పోషాడ వార్షికోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు బూరుగు రామస్వామిగౌడ్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 105 మందికి రూ.32.13లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

పెగడపల్లి: బతికపల్లి గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఈనెల 10న కారు ప్రమాదంలో మృతిచెందిన సయ్యద్ సర్వర్ పాష, సయ్యద్ జాకీర్ పాష కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శోభారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, శ్రీనివాస్, మల్లేశం, కృష్ణహరి, సుధీర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధం


సారంగాపూర్‌లో కాలిపోయిన మామిడి చెట్లు

సారంగాపూర్: సారంగాపూర్ అటవీ ప్రాంతం నుంచి మంటలు వ్యాపించడంతో ఆదివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మామిడి తోటలో పెద్ద మొత్తంలో చెట్లు కాలిపోయాయి. సారంగాపూర్ గ్రామంలోని పడమటి వైపున్న అటవీ ప్రాంతంలో మధ్యాహ్నం మంటలు పెద్ద మొత్తంలో విస్తరించాయి. మంటలు అటవీ శాఖ ఏర్పాటు చేసిన కాంటూర్ కందకాన్ని దాటి సమీపంలో ఉన్న కోండ్ర నాగమణి అనే రైతుకు చెందిన మామిడి తోటలోకి విస్తరించి చెట్లు పెద్ద మొత్తంలో కాలిపోయాయి. స్థానికులు మంటలార్పి డిప్యూటీ రేంజర్ రవికుమార్, బీట్ అధికారి గోపాల్‌కు సమాచారమందించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: మాదాపూర్ గ్రామంలో మాదాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం తుది పోరు జరిగింది. విజేతకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బహుమతులందించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



సారంగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో బోనాలను సమర్పించారు. అంతకుముందు గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు చేశారు.

అయ్యప్ప ఆలయ వార్షిక వేడుకలు


పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: పట్టణంలోని శ్రీపంచముఖ ఆంజనేయ అయ్యప్ప ఆలయ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు హోమం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హరి అశోక్‌కుమార్

కోరుట్ల: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వయోవృద్ధుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ వయోధికులు, వారి కొడుకులు, కోడళ్లు, వివిధ సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సిరికొండ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


భూపతిపూర్‌లో..

కథలాపూర్: సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో 1995–96 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా రావడం విశేషం. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఆటపాటలతో సందడి చేశారు. సామూహికంగా భోజనాలు చేశారు.

రాయికల్: భూపతిపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో 10వతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను సన్మానించారు.

హోమియో ఆసుపత్రికి పక్కా భవనం నిర్మించాలి


బతికపల్లిలో ఆరోగ్య ఉప కేంద్ర భవనంలో హోమియో ఆసుపత్రి

పెగడపల్లి: బతికపల్లి గ్రామంలోని హోమియో ఆసుపత్రి(ఆయుష్ ఆరోగ్య మందిర్)కి పక్కా భవనం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆసుపత్రికి పక్కా భవనం లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతుల నడుమ రెండు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఒక గది మందుల నిల్వకు, మరొకటి డాక్టర్ వైద్య పరీక్షలకు వినియోగిస్తున్నారు. సుమారు 37 ఏళ్ల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంత్రిగా ఉన్న జీవన్‌రెడ్డి చొరవ మేరకు ఇక్కడ హోమియో ఆసుపత్రి ఏర్పాటయింది. అయితే ఈ ఆసుపత్రి నిర్వహణకు పక్కా భవనం నిర్మాణం జరగకపోవడంతో స్థానికంగా శిథిలావస్థకు చేరుకున్న ఆరోగ్య ఉప కేంద్రంలో కాలం వెల్లదీస్తున్నారు. అన్ని రకాల వ్యాధుల నివారణకు మాత్రలు లభిస్తుండటంతో రోగుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. కనీసం రోజుకు 30 నుంచి 40 మంది వరకు రోగులు వచ్చి పోతుంటారని సిబ్బంది తెలిపారు. ఇంత ప్రాధాన్యమున్న హోమియో ఆసుపత్రికి పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి పక్కా భవనం నిర్మించాలని కోరుతున్నారు.



కథలాపూర్: మండల కేంద్రం నుంచి దుంపేట గ్రామానికి వెళ్లే మార్గంలో కథలాపూర్ శివారులో మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కథలాపూర్, సెల్‌ఫోన్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

మల్యాల: ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా సాగితే విజయం సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మల్యాల ఎక్స్‌రోడ్డులోని ఎస్‌ఎస్వీ అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాల వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీమంత్రుల దిష్టిబొమ్మ దహనం


కథలాపూర్‌లో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కథలాపూర్: కథలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీమంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఆదివారం దహనం చేశారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. కాయితి నాగరాజు, చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్, కారపు గంగాధర్, వాకిటి రాజారెడ్డి, న్యావనంది శేఖర్, కూన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్ డిమాండ్ చేశారు. జగిత్యాల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీరం రాజేశ్, మాజీ కౌన్సిలర్లు కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, బింగి రవి తదితరులు పాల్గొన్నారు.

సీవీరామన్ అకాడమీ అవార్డు అందజేత


అవార్డు అందుకుంటున్న లింబాద్రి

జగిత్యాలరూరల్: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రికి ఆదివారం హైదరాబాద్‌లో సీవీరామన్ అకాడమీ వారు సేవ వైభవ్ మహరాజ్ గోల్డ్ మెడల్ అందజేశారు. పలువురు ఆర్యవైశ్యులు, రారైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వారు లింబాద్రిని అభినందించారు.

లీగల్ అడ్వైజర్ నియామకం

కోరుట్ల: జాతీయ చిరు వ్యాపారుల సమాఖ్య కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది మహ్మద్ నయీమొద్దీన్ నియమితులయ్యారు. జాతీయ చిరు వ్యాపారుల సమాఖ్య అధ్యక్షుడు షాహెద్ మహ్మద్ షేక్ నియామక పత్రాన్ని అందించారు.

లయన్స్ క్లబ్ జిల్లా రెండో ఉప గవర్నర్‌గా చంద్రప్రకాశ్

కోరుట్ల: లయన్స్ క్లబ్ జిల్లా రెండో ఉప గవర్నర్‌గా పట్టణానికి చెందిన గుంటుక చంద్రప్రకాశ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. కోరుట్ల అధ్యక్షుడు కుందారపు మహేందర్, కార్యదర్శి గద్దె నరేంద్ర, కోశాధికారి కొమ్ముల జగపతిరెడ్డి, డాక్టర్ దిలీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి ఐకానిక్ అవార్డు


వనితకు సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన న్యాయవాది అల్లే వనిత న్యాయ వృత్తి రంగంలో చేసిన సేవలను గుర్తించి ఐకాన్ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉమెన్ ఐకానిక్ అవార్డును నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. వనితను న్యాయవాదులు అభినందించారు.

పట్టుదలతో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు


శ్రీనివాస్

కోరుట్లటౌన్: పట్టుదలతో చదివి 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఆకుల శ్రీనివాస్ అనే యువకుడు అర్హత సాధించాడు. కోరుట్ల పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలో శ్రీనివాస్ ప్రాథమిక, ఉన్నత తరగతులు చదివాడు. ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో 2019లో పూర్తయ్యింది. హైదరాబాద్‌లో గది అద్దెకు తీసుకొని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. 2019లో ప్రభుత్వ కోర్టులో ఉద్యోగ నోటిఫికేషన్ రాగా.. 2021లో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగం వచ్చింది. 2022లో ప్రభుత్వ కోర్టు జూనియర్ అసిస్టెంట్ పోటీ పరీక్షలు రాసి కోర్టులోనే మళ్లీ జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. గ్రూప్–4 పోటీ పరీక్షలో రాష్ట్రస్థాయి 743 ర్యాంకుతో ఫిబ్రవరి 2024లో జగిత్యాల కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. 2022వ సంవత్సరం గ్రూప్–2 ఫలితాల్లో 187వ ర్యాంకు, గ్రూప్–3 ఫలితాల్లో 116వ ర్యాంకు సాధించాడు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో జరిగిన మూడో జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెట్‌పల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–12 విభాగంలో వై.చరిత్, అండర్–10 విభాగంలో రామ్ బద్రి బంగారు పతకాలు సాధించారు. ప్రశంసాపత్రాలందించి అభినందించారు. కోచ్ అవినాష్ ఉన్నారు.